ప్రజాశక్తి
శనివారం 11 జనవరి 2025
5
పార్వతీపురం మన్యం

12న జాతీయ యువజన దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం

జాతీయ యువజన దినోత్సవం ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి బి.రామ్‌గోపాల్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ యువజన దినోత్సవం కార్యక్రమాన్ని లయన్స్ కల్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. జాతీయ యువజన దినోత్సవం ప్రతి ఏటా జనవరి 12న జరుగుతుందని, మన దేశ గొప్ప దార్శనికుడు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా దేశం అభివృద్ధికి యువత కీలకం అని వారి సృజనాత్మకత శక్తిని గుర్తించడానికి యువత ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమ్మె ఒప్పంద జిఒలను విడుదల చేయాలి

మున్సిపల్ కార్యాలయాల వద్ద పారిశుధ్య కార్మికుల ధర్నా, నిరసన దీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్/సాలూరు/పాలకొండ

కూటమి ప్రభుత్వం ఏర్పడి 7నెలలు గడుస్తున్నా నేటికీ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడం చాలా అన్యాయమని, సమ్మె కాలం నాటి ఒప్పందాలకు సంబంధించిన జిఒలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలో గల మున్సిపల్ కార్యాలయాల వద్ద ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యాన పారిశుధ్య కార్మికులు శుక్రవారం ధర్నా, రిలేనిరాహారదీక్షలు చేపట్టారు. ఇందులో భాగంగా పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేయగా, సాలూరు మున్సిపాల్టీ, పాలకొండ నగర పంచాయతీ కార్యాలయాల వద్ద రిలేనిరాహారదీక్షలు చేపట్టారు.

పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులతో కలిసి సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ ధర్నా నిర్వహించారు. అనంతరం శానిటర్ ఇన్స్పెక్టర్ పకీర్‌రాజుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకటరమణ, మున్సిపల్ యూనియన్ నాయకులు సిహెచ్ సింహాచలం, నాగవంశం శంకర్రావు మాట్లాడుతూ గతంలో మున్సిపల్ కార్మికులు చేసిన పోరాటానికి నాటి ప్రతిపక్షం, ప్రస్తుత అధికార ప్రభుత్వ టిడిపి నాయకులు కార్మికులకు మద్దతు తెలిపారని, నేడు అధికారం చేపట్టిన అనంతరం పూర్తిగా దాన్ని విస్మరించారని విమర్శించారు. కార్మికులకు అందించాల్సిన కనీస అవసరాలు కూడా కల్పించకుండా ప్రభుత్వం పెడచెవిన పెట్టడం

పార్వతీపురం : మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సిఐటియు నాయకులు

బాధాకరమని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు పి.రాజశేఖర్, కార్మికులు మామిడి శివ, బంగారు రవి, బంగారు రాజేష్, గుంటూరు గంగయ్యలు, మంగళగిరి శ్రీను, గంగరాజు, శివ, సీతమ్మ, ఇప్పలమ్మ, సుజాత, పాపమ్మ మరియు వర్కర్లు మేస్త్రిలు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : 2023 డిసెంబర్లో 17 రోజులు సమ్మె సందర్భంగా అప్పటి ప్రభుత్వం, అధికారులు చేసిన ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు టి.రాముడు, టి.శంకర్రావుతో కలిసి యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పలు దఫాలు పురపాలక శాఖ మంత్రికి విన్నవించినా, పరిష్కరించాలేదన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే మరో సమ్మె, చలో విజయవాడ నిర్వహించేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. తక్షణమే గత సమ్మె హామీలైన రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.75వేలకు పెంచాలని, రిటైర్మెంట్ వయసు 62ఏళ్లకు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు కార్మికులకు వర్తింపజేయాలని, దహన సంస్కార ఖర్చులకు ఇచ్చే మొత్తాన్ని రూ.20వేలకు పెంచడం, జీవో ను అమలు చేసి ఇంజనీరింగ్ సెక్షన్‌లో గల కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. జీవో 36ను అమలు చేసి డ్రైవర్లకు జీతాలు చెల్లించాలని కోరారు. మృతి చెందిన పారిశుధ్య కార్మికుని కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో మున్సిపల్ యూనియన్ జిల్లా మహిళా కన్వీనర్ టి.ఇందూ, నాయకులు వెంకన్న, ప్రసాదు, కేశవ, వాసు, గంగమ్మ పాల్గొన్నారు.

పాలకొండ : మున్సిపల్ (ఆప్కాస్)కార్మికులకు సమ్మె కాలపు హామీలకు వెంటనే జీవోలు ఇవ్వాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) పాలకొండ నగర పంచాయతీ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రిలే నిరాహార దీక్షలు సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ సమ్మె ఒప్పందాలు అమల్లో నిర్లక్ష్యం ప్రభుత్వం విడనాడాలని సమస్యలు పరిష్కారమయ్యే వరకు దశల వారి పోరాటాలు ఉధృతం చేయాలని అన్నారు. దీక్షల్లో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పాలకొండ కమిటీ కార్యదర్శి సిహెచ్ సంజీవి, సభ్యులు ఎన్.సాయికుమార్, సిహెచ్ కార్తీక్, పి.సూరిబాబు పాల్గొన్నారు. రిలే నిరాహార దీక్ష శిబిరానికి మద్దతుగా పి.వేణు, సిహెచ్ అప్పలనాయుడు, సిహెచ్ కృష్ణవేణి, బాబురావు, ఈశ్వరకుమారు, కె.నరసింహులు, శివ, ప్రజాసంఘాల నాయకులు దూసి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సాలూరులో దీక్షలను ప్రారంభిస్తున్న మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు; పాలకొండలో దీక్షనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణారావు

వైటిసి కార్యాలయం

పండగ పూటా పస్తులే

వైటిసి సిబ్బందికి మొండిచేయి
మూడేళ్లుగా జీతాల బకాయి

ప్రజాశక్తి - సాలూరు

పార్వతీపురం మన్యం జిల్లాలో గల రెండు వైటిసిల్లో పని చేస్తున్న ఉద్యోగులకు సంక్రాంతి పండుగకు కూడా జీతాలు మంజూరు కాలేదు. దీంతో వారి కుటుంబాలు అర్థాకలితో అలమటిస్తున్నాయి. వారితో పని చేయించుకుంటూ ఏళ్లతరబడి జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. సాలూరు, గుమ్మలక్ష్మీపురంలో గల వైటిసిల్లో సుమారు పది మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించే లక్ష్యంతో గతంలో టిడిపి ప్రభుత్వమే యూత్ ట్రయినింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. గతంలో ఇదే ప్రభుత్వ హయాంలో గిరిజన యువతీయువకులకు ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఒక్క శిక్షణ కార్యక్రమం కూడా నిర్వహించలేదు. మూడేళ్లుగా జీతాలు మంజూరు కాకపోయినా సిబ్బంది ఆశతో పని చేస్తున్నారు. వైటిసిలను ఏర్పాటు చేసిన టిడిపి ప్రభుత్వంపై గంపెడాశతో ఎదురు చూస్తున్నారు. ఐటిడిఎ పరిధిలో ఉన్న వైటిసి సిబ్బందికి జీతాలు మంజూరు కాకపోవడంపై వారు అసంతృప్తితో రగిలిపోతున్నారు. అన్ని శాఖల చిరుద్యోగులకు జీతాలు మంజూరు చేసిన ఐటిడిఎ అధికారులు వైటిసిల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి మూడేళ్లుగా మంజూరు చేయకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉంది. ఇప్పటికే పలుమార్లు వారు జిల్లా అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి వినతిపత్రాలు అందజేశారు. అదిగో ఇదిగో అంటూ ఐటిడిఎ అధికారులు కాలయాపన చేయడం తప్ప జీతాలు మంజూరుకు కృషి చేయడంలేదు. కనీసం పండుగ పూట ఒక నెలైనా జీతం మంజూరు చేయకపోవడం వారి కుటుంబాలు పస్తులుండే పరిస్థితి నెలకొంది.

సంతనర్సిపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని సంత నర్సిపురంలో శుక్రవారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ.. ఇక ఎన్‌టిఆర్ నగర్

పేరు మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

ప్రజాశక్తి - పార్వతీపురం

వైసిపి ప్రభుత్వ హయాంలో నిర్మించిన వైఎస్సార్ జగనన్న కాలనీలు ఇక నుంచి పిఎంఎవై ఎన్టీఆర్ నగర్‌లుగా మారనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వం భారీ సంఖ్యలో వైఎస్సార్ జగనన్న కాలనీలను ఏర్పాటు చేసింది. వేలాదిమంది పేద లబ్ధిదారులకు ఇంటి స్థలంతో పాటు, నిర్మాణానికి లక్షా 80వేల రూపాయల చొప్పున మంజూరు చేసింది. అయితే ఈ కాలనీల్లో పూర్తి స్థాయిలో ఇళ్ల నిర్మాణం జరగలేదు. లబ్ధిదారులు నివాసం ఉండే పట్టణాలకు దూరంగా భూసేకరణ చేయడంతో లబ్ధిదారులు విముఖత చూపుతున్నారు. ఇప్పటికీ ఈ కాలనీలు అసంపూర్తిగా వున్నాయి. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాజా కాలనీల పేరు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. భవిష్యత్‌లో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి ఏ విధమైన సహకారం అందిస్తుందోనని ఎదురు చూస్తున్నారు.



ఏకలవ్య పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

ఏకలవ్య స్కూల్ నిర్మాణం పూర్తికావాలి : పిఒ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. ఏకలవ్య మోడల్ స్కూల్ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. పనుల్లో ఎటువంటి జాప్యం లేకుండా త్వరితగతిన జరగాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశిత సమయానికి ముందే పూర్తికావాలని సూచించారు. ఈ పర్యటనలో ట్రైబల్ వెల్ఫేర్ డిడి కృష్ణవేణి, డిఇఇ (భద్రగిరి), ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

త్వరలో తలుపులకు మరమ్మతులు : డిఇఇ

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుమ్మిడిగెడ్డ ఆనకట్టకు చెందిన గెడ్డ వైపు గల తలుపు (స్కవర్ స్లుయిస్ గేటు) ఆపరేట్ చేస్తుండగా ఊడిపోయిందని, వాటికి మరమ్మతులు చేసి త్వరలో సాగునీరందిస్తామని నీటి పారుదల ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ డి.రవికుమార్ తెలిపారు. ఇటీవల 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన 'వృథాగా పోతున్న సాగు నీరు' కూలిన గుమ్మిడిగెడ్డ ఆనకట్ట తలుపు అన్న వార్తకు ఆయన స్పందించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కురుపాం మండలం గుమ్మిడిగెడ్డ ఆనకట్ట తలుపు ఊడిపోవడంతో నీరు వృథాగా గెడ్డలో కలిసిపోతుందన్నారు. ఈ విషయమై నీటిపారుదల ఉపవిభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రానున్న 15రోజుల్లో అంచనాలను పై అధికారులకు అందజేయనున్నట్టు ఆయన తెలిపారు.

నేడు, రేపు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో సంక్రాంతి సంబరాలను ఈనెల 11, 12 తేదీల్లో పార్వతీపురంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. సంక్రాంతి సంబరాలు నిర్వహణ పట్ల శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు సాంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు. ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ముగ్గులు, ఆటలు, గాలి పటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గులు, ఆటలు, గాలి పటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్టు కలెక్టర్ చెప్పారు. శనివారం ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ముగ్గుల పోటీలు ప్రారంభమవుతాయని, 11 గంటలకు గాలిపటాల పోటీలు, మధ్యాహ్నం 4 గంటల నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో విద్యార్థులు, స్థానిక కళాకారులతో జానపద, శాస్త్రీయ నృత్యాలు, వివిధ శాఖల ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. ఈనెల 12న ఆదివారం వివిధ శాఖల ప్రదర్శనలు, ఛాయా చిత్ర ప్రదర్శన, చిన్నారుల క్రీడలు, ఆహార ప్రదర్శన శాలలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంక్రాంతి సంబరాలు పోస్టర్ ను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, డి.ఆర్.డి.ఎ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యం నాయుడు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్రరావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి టి.కనకదుర్గ, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, విద్యా శాఖ ఎడి ఎంఇ రమా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

డిఎంహెచ్ఒ భాస్కరరావు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రజారోగ్యం దృష్ట్యా సిబ్బంది అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు వైద్యాధికారులు, వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. సిబ్బంది హాజరు నమోదు పరిశీలించి పిహెచ్‌సిలో విధులు నిర్వహిస్తున్న తీరుపై ఆరా తీశారు. ఆసుపత్రికి వస్తున్న రోగుల చికిత్సా వివరాలు ఓపి, ఐపి రికార్డులు పరిశీలించారు. మందులు లభ్యత ,అత్యవసర చికిత్సకు ప్రాథమికంగా అవసరమైన మందులు, వైద్య పరికరాల పనితీరు, కుక్క,పాము కాటు ఇంజక్షన్ల లభ్యత పరిశీలించారు. వార్డులో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్యస్థితి అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ లో జ్వర నిర్ధారణ పరీక్షలు, నివేదికలపై ఆరా తీశారు. పిహెచ్‌సిలో సాధారణ కాన్పులు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం డాక్టర్ భాస్కరరావు పలు ఆరోగ్య కార్యక్రమాలపై సిబ్బందితో సమీక్ష జరిపారు. రక్తహీనత నివారణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గర్భిణీ, బాలింతలు, కిషోర బాలికలు ఆరోగ్య ఆరోగ్య శ్రేయస్సుకు సమిష్టి కృషి చేయాలన్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో వైద్య సేవలు అందుబాటులో ఉంచాలన్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సమస్యలను సత్వరమే గుర్తించాలన్నారు. అక్కడ ఫీడర్ అంబులెన్స్‌ను పరిశీలించి వాటి సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో సిబ్బంది అన్ని వేళల్లో అందుబాటులో ఉండాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు, డిఎస్ఓ శంకర్, వైద్యాధికారులు డాక్టర్ బుద్ధేశ్వరరావు, డాక్టర్ అభిలాష్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఫీడర్ అంబులెన్స్‌ను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

ఫిబ్రవరిలోగా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

ప్రజాశక్తి - సాలూరు

ప్రభుత్వ ఫించన్‌దారులు, కుటుంబ ఫించన్‌దారులు ఫిబ్రవరి 28లోగా జీవిత ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని ఉప ఖజానా అధికారి వైకె నాయుడు కోరారు. లైఫ్ సర్టిఫికేట్‌ను ఎలా సమర్పించాలనే దానిపై ఫించన్ అసోసియేషన్ వారికి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా హాజరై ధ్రువపత్రాలు సమర్పించాల్సిన అవసరం లేకుండా కొంత వెసులు బాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా లైఫ్ సర్టిఫికేట్‌ను సమర్పించవచ్చన్నారు. దగ్గరలోని మీసేవ కేంద్రాలకు వెళ్లి జీవిత ధ్రువీకరణ పత్రాన్ని అప్లోడ్ చేయవచ్చని సూచించారు. ఆండ్రాయిడ్ మొబైల్‌లో కూడా ఫేస్ రికగ్నిజేషన్ ద్వారా లైఫ్ సర్టిఫికేట్‌ను సమర్పించవచ్చని తెలిపారు. ఉప ఖజానా కార్యాలయానికి వచ్చిన వారు ఆధార్‌కార్డుతో పాటు ఆధార్ లింక్ అయిన మొబైల్ నెంబర్ కలిగి ఉన్న మొబైల్ ఫోన్‌ను తీసుకొచ్చి కార్యాలయ సిబ్బంది సేవలను పొంది లైఫ్ సర్టిఫికేట్ సమర్పించవచ్చన్నారు. సాలూరు ఉపఖజానా కార్యాలయం పరిధిలో 1413 మంది ఫించన్ దారులున్నారని, వారంతా నూతన సాంకేతిక పరిజ్ఞానం వాడుతూ జీవిత ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందజేస్తే రాబోవు ఆర్థిక సంవత్సరానికి ఫించన్ పొందేందుకు ఇబ్బంది తలెత్తదన్నారు. పూర్తిగా మంచానికే పరిమితమైన పెన్షనర్ల వద్దకు కార్యాలయ సిబ్బంది చేరుకొని లైఫ్ సర్టిఫికేట్ సమర్పించే ప్రక్రియను పూర్తి చేస్తామని నాయుడు తెలిపారు.

పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

2,300 కేజీల పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని జనార్ధనవలస వద్ద 2300 కేజీల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. శ్రీకాకుళం విజిలెన్స్ ఎస్‌పి బి.ప్రసాదరావుకు అందిన ముందస్తు సమాచారం మేరకు మండలంలోని జనార్ధనవలస నుంచి రేషన్ బియాన్ని అక్రమంగా ఒడిశాకు తరలిస్తున్న బొలేరా వాహనాన్ని పట్టుకున్నారు. ఈ వాహనం, బియ్యం యజమాని అయిన వంగర మండలం లక్ష్మింపేటకు చెందిన ఆవు చిన్నంనాయుడుపై 6ఎ, క్రిమినల్ కేసులు పెట్టి చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఎస్ఐ బి.రామ్మోహనరావు తెలిపారు. ఈ దాడుల్లో స్థానిక సిఎస్‌డిటి ఎన్.రమేష్, విజిలెన్స్ సిబ్బంది పురుషోత్తం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డిడిని కలిసిన గిరిజన సంఘాల నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.కృష్ణవేణిని శుక్రవారం గిరిజన సంఘాల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సహాయ గిరిజన సంక్షేమ అధికారిగా ఉన్న కష్ణవేణిని ఇటీవల పూర్తి అదనపు బాధ్యతలతో డిప్యూటీ డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో ఆమెను ఐటిడిఎ కార్యాలయంలో కలిసి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల సమస్యల గురించి మాట్లాడారు. డిడిని కలిసిన వారిలో గిరిజన సంఘాల నాయకులు పల్లా సురేష్, దుక్క సీతారాం, చంద్రశేఖర్, వెంకటరమణ ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు యూనిఫారాలు అందజేస్తున్న సర్పంచి గౌరమ్మ

పారిశుధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సర్పంచ్ పులిటి గౌరమ్మ పారిశుధ్య కార్మికులకు యూనిఫారం పంపిణీ చేశారు. అలాగే మహిళలకు చీరలు పంపిణీ చేశారు. 2024-2025 ఆర్థిక సంవత్సర సంబంధించి పంపిణీ చేస్తున్నట్లు సర్పంచి తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ అధికారి ఎం.రవి, జూనియర్ సహాయకులు ఎ.నర్సింగరావు, మేజర్ పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ ప్రతాప్, కమిషనర్ సర్వేశ్వరరావు

అన్న క్యాంటీన్ పరిశీలన

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో గల అన్న క్యాంటీన్‌ను శుక్రవారం నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాప్, కమిషనర్ ఎస్ సర్వేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. అక్కడున్న భోజన పదార్థాలను పరిశీలించారు. అలాగే వాటి రుచి చూసి నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. భోజనానికి వచ్చే పేదలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు.

అడ్డగోలు నియామకాలు రద్దు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఉమ్మడి విజయనగరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో (పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించిన)జరిగిన అడ్డగోలు నియామకాలు రద్దు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ చేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖలో తాత్కాలిక పద్ధతిలో మెడికల్ ఆఫీసర్, జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్, సీనియర్ డిఆర్ -టి బీ, టి బీ -హెచ్ ఐ వీ సూపర్ వైజర్, అకౌంటెంట్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేశారన్నారు. అయితే ఈ నియామకాల్లో ఎటువంటి రిజర్వేషన్ పాటించలేదని అన్నారు. ఇది ఎస్సీ, ఎస్టీలకు జరిగిన అన్యాయం అన్నారు. నియామక ప్రక్రియలో పాటించాల్సిన నియమ, నిబంధనలు పాటించలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో తక్షణమే ఈ నియామకాలు రద్దు చేయాలని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చి, రిజర్వేషన్ ఇచ్చి పారదర్శకంగా పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

పంచాయతీ సభ్యులకు అవగాహన కల్పిస్తున్న డిపిఒ నాగరాజు

సచివాలయ సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదబోగిలి గ్రామ సచివాలయంలో పంచాయతీ జిపిడిపి ప్రణాళికపై జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఆర్థిక వనరులు సేకరణ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, అంశాలను సచివాలయ సిబ్బందికి అవగాహన కలిగించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెదభోగిలి సర్పంచి జె.తేరేజమ్మ, ఇన్‌ఛార్జి ఇఒ ఈదుబిల్లి రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో లైబ్రరీ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పట్టణంలోని బెలగాం చర్చి వీధిలో గల మున్సిపల్ లైబ్రరీ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కొయ్యాపు దుర్గా ప్రసాద్ (30)శుక్రవారం మృతి చెందారు. అనారోగ్యానికి గురైన ఆయన్ను దగ్గరలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అకస్మాత్తుగా మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులు దుఃఖసాగరంలో మునిగారు. ఆయనకు ఇటీవలే వివాహం కూడా జరిగింది. ఆయన తండ్రి శంకర్రావు మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో మరణించారు. కారుణ్య నియామకంలో భాగంగా దుర్గాప్రసాద్‌కు లైబ్రరీ అసిస్టెంట్‌గా మున్సిపల్ అధికారులు పోస్టింగ్ ఇచ్చారు. కరోనా సమయంలో దుర్గాప్రసాద్ సోదరుడు కూడా మృతి చెందారు. ఈ కుటుంబంలో వరుసగా మరణాలు సంభవించడంతో కుటుంబ సభ్యులతో, పాటు బంధువులు, స్థానికులు దుఃఖ సాగరంలో మునిగారు. దుర్గాప్రసాద్ మృతి పట్ల మున్సపల్ కమిషనర్‌తో పాటు, కార్యాలయంలో ఉన్న పలు విభాగాల అధికారులు, సిబ్బంది మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

అన్నదానం

ప్రజాశక్తి - సీతంపేట

ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్థానికతిరుమల తిరుపతి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆ ప్రాంగణంలో పోలీసుల ఆధ్వర్యంలో భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సీతంపేటతో పాటు చుట్టుపక్కల గ్రామాల గ్రామస్తులు అన్నదానానికి విచ్చేశారు. కార్యక్రమంలో ఎస్సై వై.అమ్మన్నరావు, టిటిడి ఇన్‌స్పెక్టర్ రాంబాబు, అర్చకులు, భక్తులు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని రాయిగుడ్డి వలస పంచాయతీ, ఎగువ కొత్తవలస సమీపాన శుక్రవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసుల అందించిన వివరాలిలా ఉన్నాయి. రాయిగుడ్డివలస పంచాయితీ ఎగువ కొత్తవలస గ్రామ సమీపంలో ఒక వ్యక్తి చనిపోయి పడి ఉన్నాడు. అతని వయసు సుమారు 50ఏళ్ల ఉండొచ్చు. 5 అడుగుల పొడవు, తెలుపు, నలుగు, నీలం, గులాబీ రంగుల గల ఫుల్ హాండ్స్ టీషర్టు ధరించి ఉన్నాడు,. రాయిగుడ్డివలస పంచాయతి విఆర్ఒ ఫిర్యాదు మేరకు పాచిపెంట పోలీస్ వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు,.

మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

ప్రజాశక్తి - కొమరాడ

రాష్ట్రం గత ప్రభుత్వంలో 30 ఏళ్లు వెనుకబాటుకు గురైందని, కుటమి ప్రభుత్వం వచ్చాక సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పనిచేస్తుందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపనలు, గోసాలు ప్రారంభోత్సవాలు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా మండలంలోని చోళ్లపదం, గుమడ, దేవుకోన, పాలెం గ్రామాల్లో రూ.15 లక్షలతో 400 మీటర్ల చేపట్టిన సిసి రోడ్డును ప్రారంభించారు. అనంతరం పూడేసు పంచాయతీ లంజ నుండి గూనకల్లు వరకు గల 2 కిలోమీటర్ల రహదారి రూ.1.కోటీ 80 లక్షలతో పనులకు శంకుస్థాపన చేశారు. పూడేసులో ఉపాధిహామీ నిధులతో మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.20లక్షలతో చేపట్టిన 16 గోశాలలు ప్రారంభించారు. అనంతరం పార్వతీపురం నుండి కూనేరు అంతరరాష్ట్ర రహదారి పనులను పరిశీలించారు. కూనేరు, చోళ్లపదం, ఇందిరా నగరం వద్ద గోతులు పరిశీలించి, రహదారులు, భవనాలు శాఖ ఇఇ తో మాట్లాడి సత్వరం పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ముఖ్యంగా ప్రజలకు అవసరాలైన రహదారి, మంచినీరు, విద్య, వైద్యం వంటి సదుపాయాలను ప్రతి ఒక్కరికీ కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని అన్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారులు

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

లేకపోవడంతో గిరిజనులు వైద్యం కోసం డోలిమోతలతో రావాల్సిన దయనీయ పరిస్థితి కూటమి ప్రభుత్వం స్వస్తి చెబుతుందని తెలిపారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందజేస్తూ దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లికార్జునరావు, పంచాయతీరాజ్ డిఇ, ఎఒ శంకర్రావు, మండల ఇంజనీరింగ్ అధికారి కుమార్, మండల టిడిపి అధ్యక్షులు ఎస్.శేఖర్‌పాత్రుడు, నాయకులు దేవ కోటి వెంకట నాయుడు, మధుసూదనరావు, సుదర్శనరావు, పి.వెంకట నాయుడు, కృష్ణబాబు, జనసేన నాయకులు కర్రక మల్లేష్, కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని శివ్వాంలో పల్లె పండగలో భాగంగా శుక్రవారం రూ.3లక్షలతో నిర్మించిన ప్రధాన రహదారి నుండి నాగావళి నదికి వెళ్లే రహదారికి ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభించారు. అలాగే ఉపాధి హామీ నిధులతో రైతులు నిర్మించుకున్న గోసాలలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రానున్న రోజుల్లో గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు , నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి తనతో పాటు నాయకులు ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు అక్కేన మధుసూదన్ రావు, నాయకులు, ఎం పురుషోత్తమ నాయుడు, ఎం.తవిటినాయుడు, అంబటి రాంబాబు, పెద్దింటి పూర్ణచంద్ర, పల్లా పాపి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నివేదికను చదివి వినిపిస్తున్న సోషల్ అడిట్ సభ్యుడు

బోర్డులు ఎందుకు ఏర్పాటు చేయలేదు

సోషల్ ఆడిట్‌లో డ్వామా పీడీ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ఉపాధి హామీ పనులకు సంబంధించిన బోర్డులను పని చేసిన చోట ఎందుకు ఏర్పాటు చేయలేదని సిబ్బందిపై డ్వామా ప్రాజెక్టు అధికారి కె.రామచంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై శుక్రవారం సామాజిక తనిఖీ డ్వామా పీడీ రామచంద్రరావు ఆధ్వర్యంలో జరిగింది. 18వ విడత సామాజిక తనిఖీలో 2141 పనులకు రూ.22,33,14,386 ఖర్చులపై తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు చేసిన పలు తప్పిదాలు, మస్తర్ల దిద్దుబాట్లు, వేలిముద్రలు వేయకపోవడం, పని చేసే ప్రదేశంలో నేమ్ బోర్డులు లేకపోవడాన్ని తనిఖీ సిబ్బంది గుర్తించింది. 121 బోర్డులకు పడిన నగదు మొత్తం రూ.4,88,100కు గానూ సిఆర్‌డి అకౌంటుకు రూ.2,56,400 మాత్రమే జమ చేశారు. మిగితా సొమ్మును ఫీల్డ్ అసిస్టెంట్ల పేరున జమ కావడంపట్ల పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తుల పనులను పక్కా నిర్వహించాలన్నారు. ఎలాంటి అక్రమాలకు పాల్పడ్డా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, ఎపిడి శ్రీహరి, ఎంపిడిఒ డిడి స్వరూపారాణి, ఎపిఒ ఈశ్వరమ్మ,ఉపాధి హామీ సిబ్బంది ఆయా పంచాయతీల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మికలో గోసాల ప్రారంభిస్తున్న ఎంపిపి సురేష్

గోకులం ప్రారంభం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలంలోని బిజెపురం, బొమ్మికలో కొత్తగా నిర్మించిన గోశాలలను ఎంపిపి బొంగు సురేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని, అందులో భాగంగా పాడి పశువుల ఆవాసయోగ్యం కోసం ఉపాధి హామీ చట్టం ద్వారా రూ.1,85,000 వ్యయంతో గోసాలను నిర్మించినట్టు తెలిపారు. వీటిని లబ్ధిదారులు సక్రమంగా వినియోగించుకొనేలా చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శంబంగి రమేష్, అరకు పార్లమెంటరీ పార్టీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎపిఒ కలిశెట్టి శ్రీనివాసరావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, మండల టిడిపి కన్వీనర్ పళ్లా రాంబాబు, రావాడ ఒట్టిగడ్డ చైర్మన్ మూడడ్ల సత్యం నాయుడు, సర్పంచులు, కూటమి నాయకులు ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

సంగంవలస పంచాయతీ కార్యదర్శి పకీరు మృతి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని సంగంవలస పంచాయతీ కార్యదర్శి గుజ్జల పకీరు (61) శుక్రవారం మృతి చెందారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖపట్నంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సీతానగరం మండలం బూర్జికు చెందిన పకీరు పార్వతీపురం మండలం ములగ పంచాయతీ కార్యదర్శిగా ఎక్కువ కాలం పని చేసిన ఆయన ఇటీవల జరిగిన బదిలీలకు సంగంవలస కార్యదర్శిగా వచ్చారు. ఆయన మృతికి ఎంపిడిఒ కె.రూపేష్, ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్‌ఎంపిపిలు సిద్ధ జగన్నాథరావు, బంకురి రవికుమార్, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు జగన్మోహనరావు, పలు గ్రామాలకు చెందిన సర్పంచులు సంతాపం తెలిపారు.

వేసవిలో నీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రాబోతున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు తాగునీటికి ఇబ్బందుల్లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని, అందుకు సర్పంచులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపిపి మజ్జి శోభారాణి అన్నారు. శుక్రవారం మండల సమావేశం స్థానిక మండల పరిషత్ భవనంలో ఎంపిపి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న జలజీవన్ పనులను వేగవంతం చేయడమే కాకుండా సక్రమంగా అన్ని ఇళ్లకు తాగునీరు అందేలా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. అనంతరం మండలంలోని ముఖ్య శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.రూపేష్, వైస్ ఎంపిపిలు బంకురు రవికుమార్, సిద్ధ జగన్నాధరావు, ఎఒ రమణమూర్తి, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి శోభారాణి

పలుచోట్ల సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - పాచిపెంట

మండల కేంద్రమైన పాచిపెంట -7 అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాల్లో అంగన్వాడి కార్యకర్తలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల ముగ్గులు, అలాగే భోగి మంట చుట్టూ గొబ్బెమ్మలు వేసి ఆటపాటలతో చిన్నారులు అలరించారు. ఈ సంబరాల్లో సిడిపిఒ బి.అనంతలక్ష్మి, అంగన్వాడీ సూపర్వైజర్లు, కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : జియమ్మవలస మండలం పెదమేరంగిలో గల తిరుమల సాయి హైస్కూల్ ప్రాంగణంలో శుక్రవారం సంక్రాతి సంబరాలు అంబరాన్నింటేలా ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులతో గంగిరెద్దుల, హరిదాసు వేషధారణ, హిడింబి రాక్షసులు, మహిళలతో కోలాటం, ఎద్దుల బండ్లు, ఫైర్ జంప్ మొదలైన వేశాధారణలు, విన్యాసాలు విద్యార్థులతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తిరుమల సాయి హైస్కూల్ అకాడమిక్ మోనటరింగ్ కో ఆర్డినేటర్ రౌతు వెంకటరమణ మాట్లాడుతూ అంతరించిపోతున్న సాంప్రదాయలను విద్యార్థినీ విద్యార్థులకు తెలియజేయడం కోసమే ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పెదమేరంగిలో సంబరాలు జరుపుతున్న తిరుమలసాయి పాఠశాల టీచర్లు

పాచిపెంట: సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న సిడిపిఒ అనంతలక్ష్మి

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. శుక్రవారం స్థానిక ఎస్ఐ కె.నీలకంఠం పోలీస్ స్టేషన్లో విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు దేవునిగుంప గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు పేకాట స్థావరాలపై తమ సిబ్బందితో కలిసి దాడులు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో రూ.1,63170 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పేకాట ఆడుతున్న 11 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. పేకాట స్థావరం వద్ద ఉన్న 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పండగ సమయంలో గ్రామాల్లో పేకాట స్థావరాలు, కోడిపందాలు నిర్వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని తెలిపారు. గ్రామాల్లో పండుగ సమయాల్లో బెల్ట్ షాపులు నిర్వహించి మద్యం అక్రమంగా అమ్మకాలు చేసే వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో అపరిచిత వక్తులు సంచరించినా, ఎటువంటి నిషేధిత పదార్థాలు అమ్మినా తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సరస్వతి విగ్రహానికి రంగులు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గల సరస్వతి విగ్రహంతో పాటు చుట్టూ గోడలకు జనసేన నాయకుల ఆర్థిక సాయంతో రంగులు, సున్నాలు వేసినట్లు ప్రిన్సిపల్ డిజిఎస్‌వి త్రినాథ్ శుక్రవారం తెలిపారు. చదువులమ్మ తల్లికి సహకరించిన జనసేన నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బందితో పాటు, జనసేన పట్టణ అధ్యక్షులు ఎస్.అచ్యుతరావు, కె.సాయిపవన్, ఎస్.నాగరాజు, నందివాడ పండు, పృథ్వి, ఉదయాన చరణ్, సందీపు, బండి చిన్న, హరి, పురుషోత్తం, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బూర్జలో చేపడుతున్న పారిశుధ్య పనులను ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిసి రోడ్లపై పశువులు కట్టరాదని హెచ్చరించారు. అలాగే మురుగునీరు ఉంటే దాన్ని తొలగించేలా చర్యలు చేపట్టారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పెదబోగిలిలో పారిశుధ్య పనులు చేపట్టారు

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఇఒపిఆర్‌డి కుమార్

అంగన్వాడీ కేంద్రం సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ధారపాడు పంచాయతీ రామనగరం కాలనీలో గల అంగన్వాడీ కేంద్రాన్ని ఎంపిడిఒ కె.గీతాంజలి సందర్శించారు. పిల్లలకు పోషకాహారం అందించడంలో న్యూట్రిషన్ గార్డెన్ నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్ నిమ్మక రాజేశ్వరిని అభినందించారు. పిల్లలు ఆంగ్ల అక్షరాలను చక్కగా గుర్తించారు. ధారపాడు సర్పంచ్ సుందరమ్మ, ఎపిఒ విద్యాసాగర్, పంచాయతీ కార్యదర్శి శ్రావణి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ గిరీశ, వెల్ఫేర్ అసిస్టెంట్ దుర్గమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ గీతాంజలి

నెరవేరిన చిరకాల కల

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని లుంబోరు నుంచి కోటిపల్లి మధ్యలో రైతులు, మత్స్యకారులు కొంతకాలంగా మంచినీటి బావి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అయితే ఆ కల ఎట్టకేలకు శుక్రవారం నెరవేరింది. సర్పంచ్ తిర్లంగి ఉపేంద్ర సమక్షంలో బావి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పడాల రామచంద్రరావు, మాజీ సర్పంచ్ రౌతు సోంబాబు, చిన్నంనాయుడు, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సీతానగరం, పెదఅంకలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్యాధికారులు ఎం.రాధాకాంత్, పి.ఉషారాణి, టి.పావని గర్భిణీలకు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీ సమయంలోనే సక్రమమైన వైద్యం అందించుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకొని తప్పకుండా తనిఖీలు నిర్వహించుకోవాలన్నారు. దీంతోనే రక్తహీనతను నివారించవచ్చని అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గర్భిణులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాటల రచయిత పైడిశెట్టి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలోని బూసాయవలస గ్రామానికి చెందిన యువ పాటల రచయిత రామ్ పైడిశెట్టి (42) హైదరాబాద్‌లో అనుమానాస్పదంగా మృతి చెందారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. చంటి, సితార, కలెక్టర్ గారి భార్య, నందీశ్వరుడు తదితర సుమారు 20 సినిమాలకు పాటల రచయితగా పైడిశెట్టి పనిచేశారు. ఒకచిన్న కుగ్రామానికి చెందిన ఈయన చిన్నతనంలోనే హైదరాబాద్ వెళ్లిపోయి అక్కడ పాటల రచయితగా ఎంతో పేరు ప్రతిష్టలు సంపాదించారు. ప్రముఖ గాయనీమణులు చిత్ర, శైలజ తదితరులతో ఈయన పనిచేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న ఈ గాయకుడు ఆకస్మికంగా మృతిచెందడం పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆయన మృతికి ఇదే గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపిపి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతినాయుడు సంతాపం తెలిపారు.

కొనసాగుతున్న కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియ

ప్రజాశక్తి-విజయనగరంకోట

పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలకు ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు దేహ దారుఢ్య పరీక్ష సజావుగా కొనసాగుతోందని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం 9వ రోజు పిఎంటి. పిఇటి పరీక్షలకు 600 మంది పురుష అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 408 మంది మాత్రమే హాజరయ్యారు. వేకువ జామున 5గంటల నుండే ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. ఎస్‌పి వకుల్‌జిందాల్, ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షించారు. అభ్యర్థులకు ముందుగా హాల్ టికెట్స్ పరిశీలించి, పోలీసు పరేడ్ గ్రౌండులోకి అనుమతించారు. అనంతరం, అభ్యర్థుల విద్యార్హతలు, రిజర్వేషన్లు, వయస్సు నిర్ధారించే ధవపత్రాలను పరిశీలించి, అన్ని సర్టిఫికేట్స్ సక్రమంగా ఉన్న అభ్యర్థులకు మాత్రమే బయోమెట్రిక్ తీసుకొని పిఎంటి పరీక్షలకు అనుమతించారు.